సాక్షి
సూర్యాపేట
సోమవారం। 29। జనవరి। 2024



సీఎంఆర్ పక్కదారి!
కోదాడలో రైస్ మిల్లర్ల మాయాజాలం కొనసాగుతోంది. సీఎంఆర్ పక్కదారి పట్టిందనే ఆరోపణలు వస్తున్నాయి. - 8లో



విద్య తొలి ప్రాధాన్యం కావాలి
ప్రభుత్వాలకు విద్యారంగమే తొలి ప్రాధాన్యం కావాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. - 8లో



సమాజ అభివృద్ధికి పాటుపడాలి
ప్రతిఒక్కరూ సమాజ అభివృద్ధికి పాటుపడాలని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్‌పీ.పట్నాయక్ అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

గడ్డిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సస్పెన్షన్

గరిడేపల్లి: విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకుగాను గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐతరాజు సుధాకర్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ అశోక్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మునగాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిశ్వరీకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఇటీవల ప్రిన్సిపాల్‌పై పలు ఆరోపణలు రావడంతో విచారణ జరిపిన అనంతరం ఆయనపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

గుడిసెవాసులకు పట్టా హక్కులు కల్పించాలి


మాట్లాడుతున్న ములకలపల్లి రాములు

మునగాల : అసైన్‌మెంట్ చట్టం 77ప్రకారం పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే పట్టా హక్కులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు డిమాండ్ చేశారు. మునగాల మండల కేంద్రం శివారులో ప్రభుత్వం సేకరించిన భూమితో పాటు 491సర్వేనంబర్‌లో గల భూమిలో సుమారు 100మంది గుడిసెవాసులు ఆక్రమించుకొని జెండాలు పాతారు. ఈ సందర్భంగా ఆదివారం గుడిసెవాసులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో ఏళ్ల తరబడి ఇల్లు లేక ఒకే ఇంటిలో నాలుగు కుటుంబాలు వారు జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములను గుడిసెవాసులకు కేటాయించాలన్నారు. ఈ విషయమై కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని త్వరలో పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ భూపోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకుడు దేవరం వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాంపంగు జానయ్య, మండల కమిటీ నాయకులు కిన్నెర వెంకన్న, గడ్డం వెంకన్న, లంజేపల్లి చినవెంకన్న, సాల పిచ్చయ్య, నెమ్మాది పవన్, డాకూరి వీరబాబు, దర్శిని మైసమ్మ, పుట్టేటి మంగమ్మ, పొట్టేటి లక్ష్మి పాల్గొన్నారు.

యాదాద్రీశుడికి పూజలు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం నిత్య పూజా కైంకర్యాలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ చేపట్టి హారతితో కొలిచారు. ఉత్సవమూర్తులకు నిజాభిషేకం, అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

యాక్టు-1976ను పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజుభట్

నల్లగొండ టౌన్: సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్టు-1976ను పునరుద్ధరించాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఐ.రాజుభట్ డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన ఆ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. యాక్టు 1976ను కాపాడాలని కోరుతూ ఫిబ్రవరి 16న చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ ప్రభుత్వ ఆసుపత్రులు, ఇన్‌స్టిట్యూట్లలో ఎదురయ్యే అడ్డంకులు తొలగించాలని, పనిచేయడం వారి హక్కు అని అన్నారు. మందులపై ఉన్న జీఎస్టీని తొలగించడంతోపాటు మందుల ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, నాయకులు దండెంపల్లి సత్తయ్య, కోట సుధాకర్, రావుల రవి పాల్గొన్నారు.

ఖర్చు రూ.26లక్షలలోపే..

నిబంధనలకు లోబడే ఖర్చు చేసినట్లు ఎన్నికల సంఘానికి వివరాలు
- లెక్కలు చూపడంలో జాగ్రత్త పడ్డ అభ్యర్థులు
- తుంగతుర్తి బీజేపీ అభ్యర్థి ఖర్చు రూ.25,01,040
- సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి ఖర్చు రూ. 24,05,563
- రూ.17లక్షలు దాటని హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఖర్చు
- పలువురు పార్టీ ఇచ్చిన ఫండే ఖర్చు కాలేదన్నట్లుగా లెక్కల సమర్పణ



దురాజ్‌పల్లి (సూర్యాపేట): హోరాహోరీగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆయా పార్టీలు ఇచ్చిన ఫండే ఖర్చు చేయలేదట. అభ్యర్థులు ఎన్నికల సంఘానికి సమర్పించిన ఖర్చుల వివరాలను బట్టి ఈ విషయం తేటతెల్లమైంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 121 మంది అభ్యర్థులు బరిలో నిలవగా.. వారందరూ ఖర్చుల లెక్కలు చూపారు. పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు వేశారు కానీ ఎన్నికల ప్రచారం చేయలేదు. దీంతో ఆ అభ్యర్థుల్లో కొందరికి డిపాజిట్ డబ్బులే ఖర్చయ్యాయని లెక్కలు చూపించారు.

నాటి ఎన్నికల్లో ప్రలోభాలు
శాసన సభ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారని ప్రచారం జరిగింది. పోలీసుల తనిఖీల్లోనూ లక్షల రూపాయలు పట్టుబడిన సంఘటనలూ ఉన్నాయి. ఆయా పార్టీల ఆత్మీయ సమ్మేళనాలు, బహిరంగ సభలకు జనాల తరలింపు, వారికి భోజనం, వాహనాల కోసం పెద్దఎత్తున ఖర్చు చేశారు. అదేవిధంగా సభలకు, ప్రచారాలకు హాజరైన వారికి రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు చెల్లించారు. దీంతో పాటు పోలింగ్‌కు ముందు రోజు పలు నియోజకవర్గాల్లో ఒక్కో ఓటు రూ.500 నుంచి రూ.2వేల వరకు పంపిణీ చేశారని ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల సమయంలో ఎక్కువ మొత్తంలో ఖర్చు చేసినా... చివరకు అధికారులకు చూపించిన లెక్కల్లో మాత్రం గరిష్ట పరిమితి దాటకపోవడం గమనార్హం.

నామినేషన్లు వేసిన రోజే ..
ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేసిన రోజే ఆయా అభ్యర్థులకు లెక్కలకు సంబంధించిన రిజిస్టర్లను రిటర్నింగ్ అధికారులు అందించారు. రోజు వారీ లెక్కలు నమోదు చేసి సమర్పించారు. నామినేషన్ల దాఖలు రోజు నుంచి కౌంటింగ్ వరకు ఎంతెంత ఖర్చు చేశారని అందజేశారు. కొందరు అభ్యర్థులు నేరుగా వారి సంతకాలతోనే అప్పగించగా, మరికొందరు ఎన్నికల ఏజెంట్ సంతకం ద్వారా అందించారు. వీటిని అన్నింటిని ఎన్నికల వ్యయపరిశీలకులు పరిశీలించి ఎన్నికల సంఘానికి అందించారు. అత్యధికంగా తుంగతుర్తి నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య రూ.25,01,040 ఖర్చు చూపగా, సూర్యాపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి రూ. 24,05,563 ఖర్చు చూపారు. తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ రూ. 23,25,251 ఖర్చు చూపగా, మిగిలిన అభ్యర్థులు రూ. 20లక్షల లోపే ఖర్చు చేసినట్లు లెక్కలు చూపారు.

సూర్యాపేట నియోజకవర్గంలో...

అభ్యర్థి పేరు	పార్టీ	ఖర్చు
జగదీష్‌రెడ్డి	బీఆర్‌ఎస్	24,05,563
దామోదర్‌రెడ్డి	కాంగ్రెస్	15,60,722
వెంకటేశ్వరరావు	బీజేపీ	18,54,278
జానయ్య	బీఎస్‌పీ	16,10,171

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో..

అభ్యర్థి పేరు	పార్టీ	ఖర్చు
సైదిరెడ్డి	బీఆర్‌ఎస్	19,23,540
ఉత్తమ్‌కుమార్‌రెడ్డి	కాంగ్రెస్	16,02,106
శ్రీలత	బీజేపీ	13,09,365
రఘు	ఏఐఎఫ్‌బీ	14,27,156

కోదాడ నియోజకవర్గంలో...

అభ్యర్థి పేరు	పార్టీ	ఖర్చు
మల్లయ్య యాదవ్	బీఆర్‌ఎస్	17,68,838
పద్మావతిరెడ్డి	కాంగ్రెస్	15,37,136
సతీష్‌రెడ్డి	జనసేన	10,19,745
అంజనేయులు	ఏఐఎఫ్‌బీ	6,72,160

తుంగతుర్తి నియోజకవర్గంలో...

అభ్యర్థి పేరు	పార్టీ	ఖర్చు
కిశోర్‌కుమార్	బీఆర్‌ఎస్	17,87,888
సామేల్	కాంగ్రెస్	23,25,251
రామచంద్రయ్య	బీజేపీ	25,01,040

అభ్యర్థులకు పార్టీల ఫండ్ ఇలా..
పలువురు అభ్యర్థులకు పార్టీ ఫండ్ రూ.40లక్షలు, ఇంకొందరికి రూ.25లక్షలు, మరికొందరికి రూ.10లక్షలు అందగా.. కొందరు అభ్యర్థులకు పార్టీ ఫండ్ ఇవ్వలేదు. పార్టీ ఫండ్ ఇవ్వకపోయినా కొందరు అభ్యర్థులు సొంత డబ్బులే ఖర్చు చేశారు. పలువురు పార్టీ ఇచ్చిన ఫండే ఖర్చు కాలేదన్నట్లుగా లెక్కలు సమర్పించారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం


పానుగోడులో వజ్రోత్సవ పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గరిడేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తామని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం గరిడేపల్లి మండల పరిధిలోని పానుగోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ వజ్రోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వజ్రోత్సవ పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు అభివృద్ధికి తక్షణమే రూ. 25లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పానుగోడులోని గ్రంథాలయానికి రూ. 10లక్షలు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పానుగోడులో జూనియర్ కళాశాల ఏర్పాటుకు, సబ్ సెంటర్ అప్‌డేట్‌కు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి ఉత్తమ్‌ను పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, పీడీ సుందరి కిరణ్‌కుమార్, సోమనాథం, జుట్టుకొండ సత్యనారాయణ, అందె సత్యం, కటికం రమేష్, సర్పంచ్ జోగు సరోజినిపిచ్చిరెడ్డి, ఎంపీటీసీలు మేళ్లచెరువు వెంకటరమణ, రామ్ మల్లమ్మ, ఎంఈఓ శత్రునాయక్, తహసీల్దార్ పైడిమర్రి రంగనాథ్, సుందరి నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు, నిర్వహణ కమిటీ సభ్యులు గన్నా లింగయ్య, అల్లుబెల్లి లక్ష్మారెడ్డి, సుందరి నాగయ్య, కనకయ్య, శ్రీనివాస్, మట్టయ్య పాల్గొన్నారు.

ప్రతి పౌరుడికి స్వేచ్ఛా, స్వాతంత్య్రం


లింగగిరిలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పౌరుడికి స్వేచ్ఛా, స్వాతంత్య్రం ఉంటుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని లింగగిరిలో రూ.20 లక్షలతో చేపట్టిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో రెండు అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలకు రూ.30 లక్షలు, శ్మశానవాటిక, ఈద్గాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కాగా.. లక్కవరం ఎంపీటీసీ రణపంగు కాశమ్మతో పాటు పలువురు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ లావణ్య, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, సర్పంచ్ కర్నాటి అంజిరెడ్డి, ఎంపీటీసీలు విజయలక్ష్మి, గోపిరెడ్డి, ఎన్‌డీసీఎంసీ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, నిజాముద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

వేతన వెతలు

- మెప్మా ఆర్పీలకు ఆరు నెలలుగా అందని వేతనాలు
- కష్టంగా మారిన కుటుంబ పోషణ


మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెప్మా ఆర్పీలు (ఫైల్)

హుజూర్‌నగర్: మున్సిపాలిటీల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కింద పనిచేసే రిసోర్స్ పర్సన్‌లకు గత ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం, ఎన్నికల సమయంలో వివిధ పనులతోపాటు, మహిళా సంఘాలకు సంబంధించిన పనులను వీరు నిర్వహిస్తుంటారు. వీరిలో సొంత ఇళ్లు లేని వారు కూడా ఉన్నారు. వేతనాలు సక్రమంగా అందకపోవడంతో కిరాయి ఇళ్లల్లో ఉండే వారు రెంట్ కట్టడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 213 మంది మెప్మా ఆర్పీలు
జిల్లాలోని 5 మున్సిపాలిటీల్లో 213 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. వీరిలో సూర్యాపేట మున్సిపాలిటీలో 92 మంది, కోదాడ మున్సిపాలిటీలో 51 మంది, హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో 38 మంది, నేరేడుచర్ల మున్సిపాలిటీలో 16 మంది, తిరుమలగిరి మున్సిపాలిటీలో 16 మంది చొప్పున పనిచేస్తున్నారు. అయితే వీరు ప్రధానంగా మహిళా సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పించడం, సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించడం, కొత్త సంఘాలను ఏర్పాటు చేయడం లాంటి పనులు చేస్తుంటారు. ఆర్పీలకు నెలకు రూ.4 వేలు, మహిళా సమాఖ్య ద్వారా రూ 2వేల వేతనం చెల్లిస్తారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.4 వేలు గత ఆరు నెలలుగా రావడం లేదు. బడ్జెట్ లేక వారి వేతనాలు జమ చేయలేక పోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కొంతమంది ఆయా సమాఖ్యల నుంచి మాత్రం రూ.2 వేలు తీసుకుంటున్నారు. వేతనాల విషయమై హుజూర్‌నగర్‌లో ఆర్పీలు ఇటీవల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు సకాలంలో ఇప్పించాలని మెప్మా ఆర్పీలు కోరుతున్నారు.

కనీస వేతనం రూ.18వేలు అందించాలి



మహిళా సంఘాల ఏర్పాటు, వారికి స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించడం వంటి పనులు చేస్తుంటాం. వీధివ్యాపారులకు రుణాలు ఇప్పించడం రీపేమెంట్ కూడా సక్రమంగా జరిగేటట్లు చూడటంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాం. ఆర్పీలకు ప్రభుత్వం కనీస వేతనం రూ.18వేలు అందించాలి.
– ఆదిలక్ష్మి, మెప్మా, ఎస్‌ఎల్‌ఎఫ్ ఆర్పీ హుజూర్‌నగర్

ఆరు నెలలుగా జీతాలు రావడం లేదు



గత ప్రభుత్వం జీతాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించింది. ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుంటుంబాలు గడవడం కష్టతరంగా మారింది. ప్రభుత్వం తమను కనికరించాలి. ప్రస్తుత ప్రభుత్వమైనా మానవతాదృక్పథంతో ఆలోచించి మెప్మా ఆర్పీలకు వెంటనే జీతాలు చెల్లించాలి.
– శ్రీదేవి, మెప్మా ఆర్పీ అధ్యక్షురాలు, హుజూర్‌నగర్

బడ్జెట్ విడుదల చేసిన వెంటనే వేతనాలు అందిస్తాం
మెప్మా ఆర్పీలకు గత ఆరు నెలల నుంచి వేతనాలు రాని మాట వాస్తవమే. బడ్జెట్ లేకపోవడంతో చెల్లించలేదు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. బడ్జెట్ విడుదల చేసిన వెంటనే వేతనాలు విడుదల చేస్తాం.
– రమేష్ నాయక్, జిల్లా కోఆర్డినేటర్, మెప్మా, సూర్యాపేట

ఎస్‌ఐల బదిలీ

సూర్యాపేట క్రైం: జిల్లాలోని పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఆదివారం ఎస్పీ రాహుల్ హెగ్డే ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న బాలునాయక్‌ను సూర్యాపేట రూరల్‌కు, యాదాద్రిలోని డీఐజీ జోన్ 4 లో ఉన్న బి.వెంకటరెడ్డిని ఆత్మకూర్(ఎస్)కు, సూర్యాపేట వన్ టౌన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న మహేంద్రనాథ్‌ను అర్వపల్లికి, స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న మధును మద్ది రాలకు, ఎస్‌బీ నల్లగొండలో ఉన్న సత్యనారా యణను తిరుమలగిరికి, నడిగూడెంలో ఉన్న ఎస్‌ఐ ఏడుకొండల్‌ను తుంగతుర్తికి, నా గారంలో ఉన్న ఎస్‌ఐ సైదులును ఆత్మకూర్(ఎస్)కు, సూర్యాపేట టూటౌన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న రవీందర్‌ను పెన్‌పహాడ్‌కు, సూర్యాపేట రూరల్ ఎస్‌ఐగా పనిచేస్తున్న సాయిరాంను ఎస్‌బీకి, చివ్వెంల ఎస్‌ఐగా పనిచేస్తున్న విష్ణుమూర్తిని ఎస్‌బీకి, అర్వపల్లి ఎస్‌ఐగా పనిచేస్తున్న అంజిరెడ్డిని వీఆర్‌కు, తిరుమలగిరి ఎస్‌ఐగా పనిచేస్తున్న ప్రసాద్‌ను వీఆర్‌కు, ఆత్మకూర్(ఎస్)లో పనిచేస్తున్న వెంకటరెడ్డిని వీఆర్‌కు, పెన్‌పహాడ్ ఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకన్నను సీసీఎస్‌కు, కోదాడ రూరల్ ఎస్‌ఐగా పనిచేస్తున్న సాయిప్రశాంత్‌ను సీసీఎస్‌కు, తుంగతుర్తి ఎస్‌ఐగా పనిచేస్తున్న బి.ప్రవీణ్‌కుమార్‌ను సూర్యాపేట వన్ టౌన్‌కు బదిలీ చేశారు. వీరు ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణ చేపట్టాలి

- ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్తిరెడ్డి


సూర్యాపేట డిపోలో కార్మికులతో మాట్లాడుతున్న ప్రతినిధి బృందం సభ్యులు

భానుపురి (సూర్యాపేట): పది సంవత్సరాలుగా ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణలు చేపట్టకపోవడంతో వేతనాలు పెరగక కార్మికులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్తిరెడ్డి అన్నారు. ఆదివారం ఆర్టీసీ కార్మికుల స్థానిక సమస్యల అధ్యయనం కోసం యూనియన్ రాష్ట్ర ప్రతినిధి బృందం సూర్యాపేట డిపోను సందర్శించింది. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నర్తిరెడ్డి మాట్లాడుతూ 2017, 2021 రెండు వేతనాల సవరణలు జరగకపోవడంతో ఆర్టీసీ కార్మికుల వేతనాలు పెరగలేదన్నారు. వెంటనే కార్మికులకు వేతన సవరణలు జరిపి ఏరియర్స్‌తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఉద్యోగాల నోటిఫికేషన్, కొత్త బస్సుల కొనుగోలు లేకపోవడంతో కార్మికులకు తీవ్ర పనిభారం పెరిగిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు గుండు రమేష్, ఉప్పు లక్ష్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, రంగు వెంకన్న, ఉపేందర్, పిచ్చయ్య, మల్లేష్, యాదగిరి, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, యాకమ్మ, అలివేలు, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల లెక్క పక్కాగా..

- ఎరువుల అక్రమ తరలింపును కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- నిల్వలు తెలుసుకునేందుకు ఫర్టిలైజర్ షాపుల్లో ముమ్మర తనిఖీలు
- వివరాలు ఫైవ్ యాప్‌లో నమోదు


నాగారంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ శాఖ అధికారి

నాగారం: రైతుల సాగు అవసరాలకు ఎరువుల కొరత లేకుండా, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎరువుల దుకాణాలపై క్షేత్రస్థాయి తనిఖీలు ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఇందుకోసం ఎరువుల నిల్వల లెక్కలు పక్కాగా తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ 'ఫైవ్' (ఫెర్టిలైజర్స్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టమ్) పేరిట పూర్తి స్థాయి వివరాల నమోదుకు ప్రత్యేక యాప్ రూపొందించింది. జిల్లావ్యాప్తంగా పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాల్లో పొందుపరిచిన ఎరువుల నిల్వలకు... దుకాణాల్లో కనిపించే వాస్తవ నిల్వలకు మధ్య ఎక్కువ వ్యత్యాసం ఉండటాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు. పీఓఎస్ యంత్రాల్లో నిల్వలు భారీగా కనిపించడంతో కేంద్ర ప్రభుత్వం ఆయా జిల్లాలకు ఎరువులు సరఫరా నిలిపివేసింది. దీంతో కొరత ఏర్పడి రైతులు ఆందోళనలకు దిగి పలుమార్లు ఎరువుల వ్యాపారులతో పాటు అధికారులను నిలదీశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా 'ఫైవ్' పేరిట యాప్‌ను ప్రవేశపెట్టింది.

అందుబాటులో కచ్చితమైన సమాచారం
ఏటా యాసంగి, వానాకాలం పంటలకు ఎరువుల వినియోగం అధికంగా ఉంటుంది. యూరియా, డీఏపీలను ఎక్కువగా వాడుతుంటారు. ఫైవ్ యాప్‌లో వీటి వివరాలు అందుబాటులో ఉంటాయి. జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ వద్ద ఏ దుకాణంలో ఎన్ని నిల్వలున్నాయనే వివరాలు కచ్చితంగా తెలుస్తాయి. ఇక.. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించే అవకాశాలుండవు. అలాగే వ్యాపారులు అధిక ధరలకు విక్రయించడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి పరిణామాలుండవు.

తనిఖీలు ఇలా...
ప్రతి సోమ, గురువారాల్లో మండల వ్యవసాయాధికారులు ఐదు దుకాణాల చొప్పున తనిఖీ చేయాల్సి ఉంటుంది. పాయింట్ ఆఫ్ సేల్స్ యంత్రంలోని వివరాలతో పాటు ఎరువుల ఫొటోలను యాప్‌లో నిక్షిప్తం చేయాలి. అలాగే స్టాక్ రిజిస్టర్‌లో సంతకం పెట్టే ఫొటోలను మూడు రోజుల్లోగా అప్లోడ్ చేయాలి. డివిజన్ స్థాయిలో సహాయ సంచాలకుడు (ఏడీఏ) తమ పరిధిలో వారానికి రెండు రోజుల పాటు ఐదు దుకాణాల చొప్పున తనిఖీ చేసి ఎరువుల వివరాలను ఫైవ్ యాప్‌లో నిక్షిప్తం చేయాలి. జిల్లా స్థాయిలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏఓ) వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం ఎరువుల దుకాణాల నిర్వహణ ఉందా? లేదా? అనేది తనిఖీల ద్వారా తెలుస్తుంది. ఈ యాప్‌లో కలెక్టర్‌తో పాటు వ్యవసాయ శాఖ జిల్లా అధికారులకు మాత్రమే లాగిన్ అయ్యే అవకాశం ఉండటంతో ఎరువుల నిల్వలపై పర్యవేక్షణ పకడ్బందీగా ఉంటుంది.

పారదర్శకంగా ఉండేందుకే..



ఎరువుల లెక్కలు పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం ఫైవ్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ విధానంతో వ్యాపారం, నిల్వల లెక్కలపై ప్రభుత్వం వద్ద కచ్చితమైన సమాచారం ఉంటుంది. రైతులకు అవసరమయ్యే ఎరువులను లెక్క ప్రకారం అందించే వీలుంటుంది. కృత్రిమ కొరత, అక్రమ నిల్వలకు తావుండదు. ఇప్పటికే ఏఓలకు, ఏఈఓలకు శిక్షణ ఇచ్చి, ఎరువుల దుకాణాలపై క్షేత్రస్థాయి తనిఖీలు ముమ్మరం చేశాం.
– రామారావునాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సూర్యాపేట

నెలాఖరులోగా తనిఖీల పూర్తికి ఆదేశాలు
జిల్లావ్యాప్తంగా మొత్తం 657 ఎరువుల దుకాణాలుండగా ఇప్పటివరకు 510 దుకాణాల్లో ఉన్న నిల్వలను అధికారులు తనిఖీ చేశారు. వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేసి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు. ఈ నెల 31లోగా వివరాల నమోదు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు వచ్చాయి.

- అమ్ముడుపోయారంటూ..


సూర్యాపేట మున్సిపాలిటీ 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టిన అసమ్మతి వర్గ కౌన్సిలర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

సూర్యాపేట క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. సూర్యాపేట పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీరాంనగర్‌లో నివాసం ఉంటున్న జలగం కళమ్మ శనివారం విద్యానగర్‌లో గల కుమార్తె వద్దకు వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి బీరువా తాళం పగుల గొట్టి ఉంది. బీరువాలోని నగదు బంగారం ఆభరణాలు దుండగులు ఎత్తుకెళ్లారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించారు. ఎస్‌ఐ యాకూబ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కేసు

అడ్డగూడూరు : మద్యం దుకాణం నిర్వాహకుడిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై ఆదివారం అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణంలో బండి సాయికుమార్ క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. సాయికుమార్‌ను కొద్ది రోజుల క్రితం అడ్డగూడూరుకు చెందిన పరమేష్ తాను విలేకరిని, డబ్బులు ఇవ్వకుంటూ వైన్స్ ఎలా నిర్వహిస్తారో చూస్తానని బెదిరించాడు. అనంతరం సాయికుమార్ నుంచి డిసెంబర్7వ తేదీన రూ.45వేలు, అదె నెల 11వ తేదీన 40వేలను ఫోన్ పే ద్వారా బదిలీ చేయించుకున్నాడు. మళ్లీ డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తుండడంతో సాయికుమార్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కనగల్ : కనగల్ మండల పరిధిలోని దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జనగామ జిల్లా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేసారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలకు కనగల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కూసుకుంట్ల రాజురెడ్డి, దర్వేశిపురం మాజీ సర్పంచ్ చీదేటి వెంకట్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో దర్వేశిపురం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పాలకురి సైదులుగౌడ్, లచ్చుగూడెం మాజీ సర్పంచ్ గోగు యాదయ్య, ఆలయ అర్చకులు మల్లాచారి, దొడ్డి సైదులు, మైనార్టీ నాయకుడు షేక్ షబ్బీర్, గజ్జి మురళి, అన్నబీమోజు పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యాధికారిని సస్పెండ్ చేయాలి

నల్లగొండ టౌన్: జిల్లా ఇంటర్ విద్యాధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇంటర్ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించి పూర్తిగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మూసివేయాలనే లక్ష్యంతో ఇంటర్ విద్యాధికారి పనిచేస్తున్నారని ఆరోపించారు. దొంగ సర్టిఫికెట్లతో జిల్లాలో అనేక మంది ఉద్యోగులు ఇంటర్ విద్యా శాఖలో పని చేస్తున్నారన్నారు.

సీఎంఆర్ పక్కదారి!

కోదాడలో మిల్లర్ల మాయాజాలం

- రెండు మిల్లుల్లో రూ.100కోట్ల ధాన్యం మాయమైనట్లు ఆరోపణలు
- అధికారుల తీరుపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం



రూ. 32 కోట్ల ధాన్యం మాయం చేసిన కాపుగల్లులోని రైస్‌మిల్



కోదాడ మిల్లర్ రూ.70 కోట్ల బియ్యం ఇవ్వాలని అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చిన వివరాలు

కోదాడ: కోదాడలో రైస్ మిల్లర్ల మాయాజాలం కొనసాగుతోంది. రైతుల నుంచి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి సేకరించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) పక్కదారి పట్టిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోదాడ ప్రాంతానికి చెందిన ఇద్దరు మిల్లర్లకు ప్రభుత్వం రూ.వంద కోట్ల ధాన్యం ఇవ్వగా వారిలో ఒకరు ఏకంగా రూ.32 కోట్ల ధాన్యం మాయం చేసినట్లు తెలిసింది. మరొక మిల్లర్‌కు సుమారు రూ.70 కోట్ల ధాన్యం ఇవ్వగా ఇప్పటి వరకు దానిలో కేవలం 10శాతం మాత్రమే బియ్యంగా మార్చి ఇచ్చినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులే లిఖిత పూర్వకంగా ప్రకటిస్తున్నారు. సీఎంఆర్ ఇవ్వడానికి ఈ నెల 31వ తేదీని చివరి రోజుగా ఇప్పటికే అధికారులు ప్రకటించారు. దీంతో నిర్దేశించిన గడువులోగా లక్ష్యం నెరవేరే అవకాశం కన్పించడంలేదు.

రూ.32 కోట్ల ధాన్యం మాయం

కోదాడ మండల పరిధిలోని కాపుగల్లులో ఉన్న శ్రీ ఉషస్విని రైస్ ఇండస్ట్రీస్‌కు పౌర సరఫరాల శాఖ అధికారులు రూ.32 కోట్ల ధాన్యాన్ని సీఎంఆర్ కింద కేటాయించారు. కానీ ఈ మిల్లర్ గింజ బియ్యం కూడా ప్రభుత్వానికి అప్పగించలేదు. దీంతో ఉన్నతాధికారులు మిల్లును తనిఖీ చేశారు. మిల్లులో ఒక్క బస్తా ధాన్యం కూడా లేకపోవడంతో గత సంవత్సరం ఈ మిల్లును సీజ్ చేసి కోదాడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దీంతో మిల్లర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. కొద్ది రోజుల తరువాత పోలీసులు సదరు మిల్లు యజమానిని రిమాండ్‌కు తరలించడంతో ఆయన బెయిల్‌పై వచ్చి సీజ్ చేసిన మిల్లును తెరిచి మళ్లీ వ్యాపారం చేస్తున్నాడు. దీనిపై కేసు నమోదు చేశామని, చార్జీషీట్ కూడా దాఖలు చేశామని.. వ్యవహారం కోర్టులో ఉందని పోలీసులు చెబుతున్నారు.

రూ. 70 కోట్ల ధాన్యం ఇస్తే.. పదిశాతమే బియ్యం ఇచ్చాడు

కోదాడ పట్టణ పరిధిలో ఉన్న ఓ రైస్ మిల్లుకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు 2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించి 23,325 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు. దీనిలో 67 శాతం బియ్యంగా మార్చి 15,628 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ మిల్లర్ ఈ నెల 8వ తేదీ నాటికి కేవలం 5564 మెట్రిక్ టన్నుల బియ్యం ఇచ్చాడు. ఇంకా 10,063 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. వానాకాలం బియ్యం ఇవ్వని ఇదే మిల్లర్‌కు 2022–23 యాసంగికి సంబంధించి 15,535 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు. దీనికి గాను సదరు మిల్లర్ 10,408 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా గింజ బియ్యం కూడా ప్రభుత్వానికి ఇవ్వలేదు. ఈ రెండు సీజన్‌లకు సంబంధించి ఈ ఒక్క మిల్లు నుంచి 20, 472 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉంది. ప్రస్తుత మార్కెట్ రేట్ ప్రకారం ఈ బియ్యం విలువ రూ.70 కోట్లకు పైగానే ఉంటుందని పలువురు మిల్లర్లు అంటున్నారు. ఈ మిల్లర్‌కు పౌరసరఫరాలశాఖ అధికారులు 2023–24 వానాకాలం సీజన్‌లో కూడా మరో4,030 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించారు.

నిబంధనలు ఉల్లంఘించి

కొమరబండకు చెందిన ఈ మిల్లు వ్యాపార నిమిత్తం ఓ జాతీయ బ్యాంక్ నుంచి దాదాపు రూ.70 కోట్ల రుణం తీసుకుంది. దాని కిస్తీలను సకాలంలో చెల్లించక పోవడంతో బ్యాంక్ దాన్ని నాన్ పే మెంట్ అకౌంట్ (ఎన్‌పీఏ)గా ప్రకటించింది. వాస్తవానికి ఇలాంటి మిల్లుకు అధికారులు ధాన్యం కేటాయించకూడదు. కానీ జిల్లాలో ఏ మిల్లుకు కేటాయించనంత ధాన్యం ఈ మిల్లుకు కేటాయించడం వెనుక జిల్లా స్థాయిలో కొందరు అధికారులు కీలకంగా వ్యవహరించి రూ.లక్షలు దండుకున్నారనే ఆరోపణలు న్నాయి. మరో విషయం ఏమిటంటే ఈ మిల్లుకు ధాన్యం కేటాయించడానికి గ్యారంటర్‌గా ఉన్న నేరేడుచర్లకు చెందిన మరో మిల్లర్ తనకు కేటాయించిన సీఎంఆర్ ధాన్యం మాయం చేయడంతో అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేసి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఇద్దరు మిల్లర్ల వ్యవహారంపై పలువురు అధికారులకు ఫిర్యాదు చేసినా వాటిని బుట్టదాఖలు చేస్తూ వస్తున్నారు. దీనికి కారణం గతంలో అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే అండదండలతో అధికారులు చర్యలు తీసుకోలేదని, చర్యలు తీసుకుంటే తమ బండారం కూడా బయటపడుతుందని పట్టించుకోలేదని పలు వురు మిల్లర్లే అంటున్నారు.

31వ తేదీలోగా బియ్యం రాబట్టాలని మంత్రి ఆదేశం?

ప్రభుత్వం నుంచి కోట్ల రూపాయల సీఎంఆర్ ధాన్యం తీసుకొని ప్రభుత్వానికి బియ్యం ఇవ్వని మిల్లర్లపై కనీస చర్యలు తీసుకోక పోవడంపై పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. గతంలో కోదాడకు చెందిన ప్రజాప్రతినిధి అండతో జిల్లా స్థాయి అధికారులను సైతం లెక్క చేయకుండా వ్యవహరించిన మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బియ్యాన్ని ఈ నెల 31 వరకు రాబట్టాలని ఆదేశించినట్లు తెలిసింది.

చార్జిషీట్ దాఖలు చేశాం

కోదాడ మండలం కాపుగల్లుకు చెందిన ఉషస్విని రైస్ ఇండస్ట్రీస్ రూ.32 కోట్ల ధాన్యం మాయం చేసిందని పౌరసరఫరాలశాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోదాడ రూరల్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై విచారణ జరిపి చార్జిషీట్ కూడా దాఖలు చేశాం. నేరేడుచర్లకు చెందిన మరో మిల్లుపై కూడా కేసు నమోదు చేశాం.

– ప్రకాశ్, డీఎస్పీ

అమ్ముడుపోయారంటూ..



సూర్యాపేటలో ఆందోళనకు దిగిన అసమ్మతి వర్గ కౌన్సిలర్లను చెదరగొడుతున్న పోలీసులు

- సూర్యాపేట మున్సిపల్ 45వ వార్డు కౌన్సిలర్ ఇంటి ఎదుట ఆందోళన
- మున్సిపల్ చైర్‌పర్సన్, అసమ్మతివర్గ కౌన్సిలర్ల మధ్య తోపులాట
- కౌన్సిలర్ కొండపల్లి నిఖిలపై చైర్‌పర్సన్ అనుచరుల దాడి
- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు



కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న అసమ్మతి వర్గ కౌన్సిలర్లు

సూర్యాపేట: సూర్యాపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసానికి మద్దతుగా తీర్మానంపై సంతకం పెట్టి, చివరి క్షణంలో హ్యాండ్ ఇచ్చిన 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ ఇంటి ఎదుట అసమ్మతివర్గ కౌన్సిలర్లు ఆదివారం ఆందోళనకు దిగారు. శనివారం నిర్వహించిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి హాజరుకాకుండా ఉండడంతో అసమ్మతి వర్గ కౌన్సిలర్లు గండూరి పావని కృపాకర్ ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పలువురు అసమ్మతివర్గ కౌన్సిలర్లు మాట్లాడుతూ తామంతా ఆత్మగౌరవం కోసమే మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టామన్నారు. అవిశ్వాసం పెట్టే సమయంలో 32 మంది కౌన్సిలర్లం కలిసి మాట్లాడుకుని సంతకాలు చేశామన్నారు. అవిశ్వాస తీర్మాన కాపీపై సంతకం పెట్టి అవిశ్వాసం రోజున హాజరుకాకుండా అమ్ముడుపోయారని గండూరి పావనిపై ధ్వజమెత్తారు.

మాటల మంటలు.. తోపులాట

గండూరి పావని కృపాకర్ ఇంటి ఎదుట అసమ్మతి వర్గ కౌన్సిలర్లు ఆందోళనకు దిగిన విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ తన మహిళా అనుచరులు, పార్టీ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున పావని నివాసానికి చేరుకున్నారు. అదే సమయంలో ఆందోళన చేస్తున్న అసమ్మతి వర్గ మహిళా కౌన్సిలర్లతో చైర్‌పర్సన్ అన్నపూర్ణ మాట్లాడుతూ తాను ఎక్కడ అవినీతి చేశానో చెప్పాలని నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల మంటలతో పాటు చైర్‌పర్సన్ వెంట వచ్చిన మహిళా అనుచరులు ఒక్కసారిగా 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలపై దాడి చేశారు. దీంతో తలకు గాయమైంది. విషయం తెలుసుకున్న సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం, సీఐలు రాజశేఖర్, అశోక్‌రెడ్డి హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.



చైర్‌పర్సన్ అన్నపూర్ణ అనుచరుల దాడిలో గాయపడిన కౌన్సిలర్ కొండపల్లి నిఖిల

కొండపల్లి నిఖిలపై దాడి అమానుషం

శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కొండపల్లి నిఖిలతో పాటుగా మహిళా కౌన్సిలర్లపై మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, బీఆర్ఎస్ నాయకుల దాడి అమానుషమని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండపల్లి నిఖిలను ఆయన పరామర్శించి జరిగిన విషయాన్ని అడిగితెలుసుకున్నారు. దాడులు చేస్తే ఊరుకునేదే లేదని హెచ్చరించారు.

దాడుల సంస్కృతి ప్రగతికి గొడ్డలి పెట్టు

సూర్యాపేట : దాడుల సంస్కృతి ప్రగతికి గొడ్డలిపెట్టు అని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలో ప్రశాంతతను చెదరగొడుతున్న వారిపై తిరుగబాటుకు వ్యాపారులు సన్నద్ధం కావాలన్నారు. దళిత మహిళా మున్సిపల్ చైర్‌పర్సన్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి విఘాతమన్నారు. ఆమె నేతృత్వంలో సూర్యాపేట పురపాలక సంఘం సాధించిన అభివృద్ధి జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1984–85 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక ఓ ఫంక్షన్‌హాలులో ఘనంగా నిర్వహించారు. 39 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకొని ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. నాటి పాఠశాలలో గడిపిన జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆటపాటలతో గడిపారు. అనంతరం ఉపాధ్యాయులు రాచకొండ సత్తయ్య, దేవదాస్, రావిరాల స్వామిలకు శాలువా కప్పి, మెమెంటో అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జెడ్పీటీసీ కోట పుష్పలత, బీజేపీ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, అర్బన్‌బ్యాంకు వైస్‌చైర్మన్ సూరెపల్లి రమేశ్, దోర్నాల వెంకటేశం, మాటూరి రామకృష్ణ, కూరపాటి స్వామి, సంగెం నాగేశ్వర్, సూరెపల్లి రవీందర్, కర్నాటి అరవింద్, వేముల బాల్‌నర్సింహ, బొక్క సత్తిరెడ్డి, జెల్ల బాల్‌నర్సింహ, భోగ రఘు, రుద్ర అంజనేయులు, అశోక్, సూరెపల్లి సురేశ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

నల్లగొండ: నామినేటెడ్ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ప్రభుత్వం రెండింటిని అమలు చేసిందని, త్వరలో మిగతావి కూడా అమలు చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో బీసీలకు న్యాయం జరుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

పాలకులకు విద్యారంగమే తొలి ప్రాధాన్యం కావాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

శాలిగౌరారం: ప్రభుత్వాలకు విద్యారంగమే తొలి ప్రాధాన్యం కావాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన టీఎస్‌యూటీఎఫ్ నల్లగొండ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశంతో కలిసి ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో తొమ్మిదన్నరేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ నాణ్యమైన విద్య అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం

విద్యారంగాన్ని పురోగాభివృద్ధి పరిచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తుంగతుర్తి, నకిరేకల్ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యారంగంలో సమూల మార్పులు రావాలని అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, ఉపాధ్యక్షుడు రాములు, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, యూటీఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు మెతుకు సైదులు, శ్రీనివాసాచారి, జెడ్పీటీసీ ఎర్ర రణీల తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళా కూలీ మృతి

డిండి: ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఓ మహిళా కూలీ మృతిచెందింది. డిండి మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. డిండి మండల పరిధిలోని కె.గౌరారం, జాల్‌తండాకు చెందిన 12మంది కూలీలు శాంతిగుడెం మిరప తోటలో కూలికి వెళ్లారు. పని ముగిసిన తర్వాత సాయంత్రం కూలీలు ఆటోలో స్వగ్రామానికి బయలు దేరారు. ఈ క్రమంలో కామేపల్లి స్టేజీ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న రాత్లావత్ ముత్యాలి(45) అక్కడికక్కడే మృతిచెందగా మరో ఐదుగురికి గాయాలయ్యాయి.



ముత్యాలి మృతదేహం

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులతో పాటు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోత్కూరులో విషాదం



మల్లేష్ (ఫైల్)

మోత్కూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్ల మండల పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మోత్కూరుకు చెందిన యువకుడు మృతిచెందడంతో అతడి స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మోత్కూరు పట్టణానికి చెందిన బోడ శ్రీను, కరుణ దంపతుల కుమారుడు మల్లేష్ నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. ఆస్పత్రి పనిపై మల్లేష్ అతని స్నేహితుడు మణికంఠతో కలిసి బైక్ ఆదివారం సాయంత్రం మాచర్లకు బయలుదేరారు. మార్గమధ్యలో మాచర్ల మండలం భైరవునిపాడు వద్ద గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టడంతో మల్లేష్ (30) అక్కడికక్కడే మృతిచెందగా, మణికంఠకు తీవ్రగాయాలయ్యాయి. శ్రీను, కరుణ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు సంతానం కాగా మల్లేష్ రెండో కుమారుడు. మల్లేష్ మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం తీసుకురానున్నారని బంధువులు తెలిపారు.



ఘటనాస్థలిలో మల్లేష్ మృతదేహం

కూరెళ్ల విఠలాచార్యకు అభినందనల వెల్లువ



కూరెళ్లను సన్మానిస్తున్న వెల్లంకి యువకులు



కూరెళ్లతో కుటుంబ సభ్యులు, బంధువులు

రామన్నపేట : పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన కూరెళ్ల విఠలాచార్యకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం వెల్లంకిలోని ఆచార్య కూరెళ్ల గ్రంథాలయానికి సందర్శకుల తాకిడి పెరిగింది. స్థానిక యువకులు, బంధువులు, సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు పెద్దసంఖ్యలో వచ్చి కూరెళ్లను అభినందించారు. శాలువాలతో సత్కరించి ఆశీర్వాదం పొందారు. సినీనటుడు రామ్‌చరణ్ ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలిపారు.

శుభవార్త చర్చిని సందర్శించిన జర్మనీ దేశస్తులు



మఠంపల్లిలోని శుభవార్త చర్చిలోకి జర్మనీ దేశస్తులను ఆహ్వానిస్తున్న విచారణ గురువులు

మఠంపల్లి: క్రైస్తవులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతున్న మఠంపల్లిలోని శుభవార్త చర్చిని ఆదివారం జర్మనీ దేశస్తులు సందర్శించారు. మఠంపల్లికి చెందిన ఫాదర్ రజనీరెడ్డి జర్మనీలో పనిచేస్తుండటంతో ఆయన ద్వారా శుభవార్త చర్చి చరిత్ర తెలుసుకొని సుమారు 30మంది జర్మనీ క్రైస్తవులు చర్చికి వచ్చారు. శుభవార్త చర్చి ఫాదర్ మార్టిన్ వారికి కోలాట భజనలతో ఘన స్వాగతం పలికారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, దివ్యబలిపూజ నిర్వహించారు. అనంతరం వారిని శాలు వాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫాదర్లు మాథ్యూస్, ఫాదర్‌బాల, చర్చికమిటీ పెద్దలు, శుభోదయాయూత్ సభ్యులు పాల్గొన్నారు.



మఠంపల్లిలో శుభవార్త చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న జర్మనీ దేశస్తులు

చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

యాదగిరిగుట్ట: బస్టాండ్‌లో మహిళల మెడలో నుంచి బంగారు గొలుసులను అపహరిస్తున్న ముఠాను యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన కాలె యశోద స్వగ్రామానికి వెళ్లేందుకు శనివారం సాయంత్రం యాదగిరిగుట్ట బస్టాండ్ వచ్చింది. ఆమె బస్సు ఎక్కుతున్న సమయంలో నాలుగు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కొద్దిసేపటి తర్వాత గుర్తించిన బాధితురాలు రాత్రి 8గంటల సమయంలో యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ రమేష్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. నలుగురు మహిళలు యశోద మెడలో నుంచి బంగారు పుస్తెల తాడును అపహరిస్తున్న దృశ్యాలు కనిపించాయి. అప్రమత్తమైన సీఐ, ఇతర పోలీస్ సిబ్బందితో కలిసి పాతగుట్టకు వెళ్లే దారిలో వెతికారు. అక్కడే లక్ష్మీ థియేటర్ సమీపంలో కర్నూల్ జిల్లాకు చెందిన గుజ్జల చెన్నమ్మ, నాదె పద్మ, ఎస్.పూజ, ఉప్పడి అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు కనిపించింది. వెంటనే దానిని రికవరీ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో గుజ్జల చెన్నమ్మపై 44 చోరీ కేసులు, నాదె పద్మపై మూడు కేసులు ఉన్నాయని, నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

నల్లగొండ టౌన్: అంగన్‌వాడీ టీచర్లకు నెలకు కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు జొన్నలగడ్డ వెంకటరమణ కోరారు. ఆదివారం నల్లగొండలోని టీఎన్‌జీఓస్ భవన్‌లో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. సిబ్బందికి హెల్త్ కార్డులతోపాటు కమర్షియల్ సిలిండర్లను డొమస్టిక్‌గా మార్చి ఒక్కో సెంటర్‌కు డబుల్ సిలిండర్లను ఇవ్వాలన్నారు. కూరగాయల బిల్లులు పెంచాలన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి మజ్జిగపు సునీత, కోశాధికారి సునీత, టీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రవణ్‌కుమార్, కార్యదర్శి కిరణ్‌కుమార్, కోశాధికారి జయరావు, ఆయా యూనియన్ల మురళి, దుర్గయ్య, శశికళ, అరుణ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అంగన్‌వాడీల అసోసియేషన్, టీఎన్‌జీఓస్ ప్రతినిధులు